


టన్ను చీనీ రూ.39 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.39 వేలు పలికాయి.



కాసులు కురిపిస్తున్న రెడ్ లేడీ

కొత్త రకం బొప్పాయి 'రెడ్‌లేడీ' రైతులకు కాసులు కురిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 4,646 హెక్టార్లలో సాగులో ఉంది. 8లో

గరిష్టం/కనిష్టం 40.9°/23.2°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత అధికంగా ఉంది.

భవిత.. పదిలం

ఆ చిన్నారులకు చదువుకోవాలనే ఆశ ఎంతగానో ఉంటుంది. భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలనే తపన మెండుగా ఉంటుంది. అయితే, ఆడపిల్లను బరువుగా భావించే వారి తల్లిదండ్రులు ఆ చిన్నారుల కలలపై నీళ్లు జల్లుతున్నారు. ఎవరికో ఒకరికి కట్టబెట్టేసి బంగారు భవిష్యత్తును బుగ్గిలో కలిపేస్తున్నారు. బాల్యవివాహాలను నిషేధిస్తూ చట్టమొచ్చినా.. శిక్షలు కఠినంగా లేక చిన్నారి పెళ్లిళ్లు ఆగడం లేదు. ఇకపై అలా కుదరదు.. బాలికలకు పెళ్లి చేసే వారిని కఠినంగా శిక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది.

- బాల్య వివాహాల కట్టడికి సర్కారు కొత్త జీఓ
- గ్రామస్థాయిలోనే కట్టడికి చర్యలు
- చిన్నారికి పెళ్లంటే ఇకపై కఠిన శిక్షే
- రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ. లక్ష జరిమానా

గడిచిన ఐదేళ్లలో అధికారులు నిలిపివేసిన బాల్యవివాహాలు ఇలా..

సంవత్సరం	సంఖ్య
2018-19	450
2019-20	430
2020-21	460
2021-22	418
2022-23	460





గ్రామ పరిధిలో పర్యవేక్షణ..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అభివృద్ధిలో సమాజం ఎంతో పురోగతి చెందినా ఆడపిల్లకు పద్దెనిమిదేళ్లు నిండకుండానే పెళ్లి చేసే తల్లిదండ్రులు ఇప్పటికీ ఉన్నారు. ఇలాంటి తలిదండ్రుల కారణంగా వేలాది మంది బాలికలు ఉజ్వల భవిష్యత్తును చేజేతులారా కోల్పోతున్నారు. ఆరోగ్యపరంగా కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే, ఇలాంటి చర్యలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా సర్కారు చర్యలకు ఉపక్రమించింది. బాల్యవివాహాలు నిషేధిస్తూ తాజాగా ప్రత్యేక జీఓ జారీ చేసింది. వయసు నిండకుండా పెళ్లి చేస్తే అమ్మాయి తల్లిదండ్రులతో పాటు ఇకపై అబ్బాయి తల్లిదండ్రులపైనా కఠిన చర్యలు తీసుకుంటారు.

బాల్య వివాహాలపై గ్రామ స్థాయిలోనే నిఘా పెంచనున్నారు. దీనికోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలో కమిటీకి చైర్‌పర్సన్‌గా కలెక్టర్ ఉంటారు. గ్రామ స్థాయిలో సర్పంచ్/కౌన్సిలర్/కార్పొరేటర్ చైర్మన్‌గా ఉంటారు. సభ్యులుగా పంచాయతీ సెక్రటరీ, విలేజ్ లేదా వార్డుమెంబర్, ఎస్‌హెచ్‌జీ, ఏఎన్‌ఎం, ఎజీఓ ప్రతినిధి, అంగన్‌వాడీ వర్కర్, ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీలు ఉంటారు. అమ్మాయికి పెళ్లి చేయాలంటే 18 ఏళ్లు నిండాలి. అబ్బాయికి 21 ఏళ్లు నిండితేనే పెళ్లికి అర్హులు. అంతకంటే తక్కువ వయసు ఉన్నట్టు అధికారులు గుర్తిస్తే తక్షణమే పెళ్లిని రద్దుచేసి, కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారు.

బంధువులు, పంతులుకూ శిక్ష!

- బాల్యవివాహం చేసిన కుటుంబ సభ్యులతో పాటు, పెళ్లి కుదిర్చిన వారికి, పెళ్లిచేసిన పంతులుకు, బంధువులకూ శిక్ష విధిస్తారు.
- బాల్యవివాహ నిరోధక చట్టం 2006 సెక్షన్ 9, 10, 11 (1) ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష ఉంటుంది.. లేదా లక్ష రూపాయల జరిమానా విధిస్తారు.
- సెక్షన్ 15 ప్రకారం బెయిల్ ఇవ్వడానికి వీల్లేదు.
- బాల్యవివాహాల సమాచారం తెలియజేసేందుకు హెల్ప్ లైన్ నెంబర్లు ...చైల్డ్ లైన్ 1098, హెల్ప్ లైన్ 181, పోలీస్ 100కు కాల్ చేయాలి
- బాల్యవివాహాల నిలిపేయడంలో అధికారులు ఎవరైనా నిర్లక్ష్యం వహించినా వారికీ శిక్షలు వర్తిస్తాయి.
- పెళ్లి జరిగే సమయంలో ఆడపిల్ల వయసుపై అనుమానం ఉంటే జువైనల్ మెజిస్ట్రేట్ అధికారి స్టేట్‌మెంట్ ప్రకారం నిర్ధారిస్తారు.

అమ్మాయి బరువు కాదు ఆస్తి



"మారుతున్న పరిస్థితుల్లో అమ్మాయి అయినా, అబ్బాయి అయినా ఒక్కటే. అమ్మాయిని బరువుగా కాకుండా గొప్ప ఆస్తిగా భావించాలి. బాలికలకు చిన్నతనంలో పెళ్లి చేస్తే చదువుకు ఆటంకం కలగడంతో పాటు ఆరోగ్య సమస్యలు వస్తాయి. దీన్ని తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. బలవంతంగా పెళ్లి చేస్తే చర్యలు తీసుకుంటాం.

– శ్రీదేవి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

న్యూస్‌రీల్

విత్తన నాణ్యతపై ఫిర్యాదులొస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అగ్రికల్చర్: విత్తనాల నాణ్యతపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని జేసీ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక హిమబిందు డిగార్డిగేటర్‌లో విత్తన వేరుశనగ శుద్ధిని పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాయితీ విత్తన పంపిణీకి నాణ్యమైన విత్తనం సరఫరా చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు లేవని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రావణి ఎంటర్‌ప్రైజెస్ విత్తన అమ్మకం దుకాణాన్ని జేసీ తనిఖీ చేశారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి వివిధ రకాల విత్తనాలు, బిల్లులు, రికార్డులు పరిశీలించారు. కాగా, శ్రావణి సీడ్స్ షాపులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రూ. 9.40 లక్షలు విలువజేసే వివిధ రకాల విత్తనాలను సీజ్ చేసినట్లు ఏడీఏ రవి తెలిపారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యమొద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి

బుక్కరాయసముద్రం: ప్రజలకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహించరాదని డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రేగడి కొత్తూరు గ్రామంలో నిర్వహించిన 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో డయాబెటిస్, బీపీ, డయాలసిస్ రోగులు ఎంత మంది ఉన్నారు, వారికి మందులు సక్రమంగా ఇస్తున్నారా లేదా అనే వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆరోగ్య శ్రీ పథకంపై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్వాతి లక్ష్మి, సూపర్ వైజర్ ఈశ్వరమ్మ, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ గౌతమి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్‌లో 'అనంత' విద్యార్థి సత్తా

- రాష్ట్రస్థాయి 3వ ర్యాంకు సాధించిన పుట్లూరు రోహిత్



అనంతపురం: ఐసెట్–2023లో అనంతపురం నగరానికి చెందిన పుట్లూరు రోహిత్ సత్తా చాటాడు. గురువారం విడుదలైన ఫలితాల్లో 162 మార్కులతో రాష్ట్రస్థాయి 3వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా పుట్లూరు రోహిత్ మాట్లాడుతూ ఐసెట్‌లో రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అమ్మ ప్రోత్సాహంతోనే మంచి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంసీఏ చేసి, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌గా రాణించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. ఐసెట్‌కు ఎక్కడా కోచింగ్ తీసుకోలేదని, కేవలం యూట్యూబ్‌లో కోచింగ్ వీడియోలను చూసి సబ్జెక్టుపై అవగాహన పెంచుకున్నట్లు తెలిపారు. క్రమం తప్పకుండా ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేయడంతోనే మంచి ర్యాంకు దక్కిందన్నారు.

రేపు హుబ్లీ-విశాఖ ప్రత్యేక రైలు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా శనివారం హుబ్లీ–విశాఖపట్నం మధ్య వన్‌వే సమ్మర్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు హుబ్లీ జంక్షన్ (07305) నుంచి బయలుదేరి గదగ్, కొప్పల్, హోస్పేట్, తోర్నగల్లు, బళ్లారి, (వయా గుంతకల్లు బైపాస్ మీదుగా) ఆదోని, రాయచూరు, కృష్ణ, చిత్తపూర్, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, నెలగొండ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడం, రాజమండ్రి, సామర్లకోట, తుని మీదుగా మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు విశాఖపట్నం చేరుతుందన్నారు. ఏసీ–టూటైర్, ఏసీ–3, స్లీపర్ కోచ్‌తో పాటు సెకండ్ క్లాస్ బోగీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయి సదస్సులో విప్ కాపు



సమావేశంలో పాల్గొన్న విప్ కాపు

రాయదుర్గం: ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన జాతీయ స్థాయి ఎమ్మెల్యేల సదస్సులో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. మూడు రోజుల పాటు సాగనున్న సదస్సులో విప్ కాపు మాట్లాడనున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, చట్టసభల అధ్యక్షులు, రాజనీతిజ్ఞులు సదస్సులో పాల్గొన్నట్లు విప్ తెలిపారు.

సెల్‌ఫోన్ మరమ్మతు, ఫొటోగ్రఫీపై ఉచిత శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో ఉచితంగా సెల్‌ఫోన్ మరమ్మతు, ఫొటోగ్రఫీపై శిక్షణ కల్పిస్తున్నట్లు డైరెక్టర్ కనకేశ్వరుడు ఓ ప్రకటనలో తెలిపారు. జులై 1 నుంచి 30 రోజుల పాటు శిక్షణ కల్పిస్తామన్నారు. ఉచిత భోజన వసతి ఉంటుందన్నారు. 19 నుంచి 35 సంవత్సరాల్లోపు యువకులు అర్హులన్నారు. 9618876060, 9440905479 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

28 వరకూ గుంతకల్లు-చిక్‌జాజూర్ ప్యాసింజర్ రద్దు

గుంతకల్లు: గుంతకల్లు–చిక్‌జాజూర్ మధ్య తిరిగే ప్యాసింజర్ రైళ్లను ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకూ రద్దు చేస్తున్నట్లు దక్షణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బళ్లారి–రాయదుర్గం మధ్య ట్రాక్ పనులు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు

- డీఎల్‌డీఓ ఓబుళమ్మ

అనంతపురం సిటీ: గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలకు శ్రీకారం చుట్టినట్లు అనంతపురం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) చిలంకూరు ఓబుళమ్మ గురువారం తెలిపారు. సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు ప్రజలకు మరింత అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగానే సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు నడుం బిగించిందన్నారు. రిజిస్ట్రేషన్ సేవలను సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకురావడం వల్ల ప్రజలు పట్టణ ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. డబ్బుతో పాటు విలువైన సమయాన్ని కోల్పోకుండా ఉండొచ్చన్నారు. సచివాలయాల్లో మార్టిగేజ్ రసీదు, వీలునామా, తనిఖీ దస్తావేజు, విక్రేత స్థలాలు, స్పెషల్ వివాహాలు, ఇతర రకాల సేవలు కూడా అందించనున్నట్లు వెల్లడించారు. వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలని సచివాలయ ఉద్యోగులను డీఎల్‌డీఓ కోరారు.



శెట్టూరులో భూముల రిజిస్ట్రేషన్ అనంతరం సంబంధిత పత్రాలను రైతుకు అందజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణ

సద్వినియోగం చేసుకోవాలి

శెట్టూరు: సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణ సూచించారు. శెట్టూరులోని గ్రామ సచివాలయంలో భూముల రిజిస్ట్రేషన్‌ను గురువారం ప్రారంభించారు. కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో శెట్టూరు గ్రామానికి చెందిన కొందరు రైతుల భూములను రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వ్యయ ప్రయాసలు తగ్గించేందుకు ఈ సేవలను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. పారదర్శకంగా భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వ్యాసరావు, డిజిటల్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

పెనుకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



నీలం రమేష్‌రెడ్డి (ఫైల్)

రాప్తాడు రూరల్/పెనుకొండ: పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి (55) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజులుగా ఆయన ఛాతి నొప్పితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. స్టంట్ కూడా వేశారు. గురువారం ఉదయం మరోమారు గుండెపోటు రావడంతో మృత్యువాత పడ్డారు. సమాచారం అందుకున్న పెనుకొండలోని అధ్యాపకులు, విద్యార్థులు కళాశాలలో సంతాపం ప్రకటించారు. కాగా, రమేష్‌రెడ్డి భార్య మాధవి అనంతపురం మండల ఈఓఆర్డీగా చేస్తున్నారు. కుమారుడు ఎంఏ పూర్తి చేశారు.

సుదీర్ఘకాలం ఆర్ట్స్ కళాశాలలో...

నీలం రమేష్‌రెడ్డి సుదీర్ఘకాలం అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడిగా పనిచేశారు. ఆ తర్వాత కళ్యాణదుర్గం కళాశాలకు బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి పదోన్నతిపై పెనుకొండ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. ప్రభుత్వ కళాశాలల టీచర్ల అసోసియేషన్ (జీసీటీఏ) జిల్లా అధ్యక్షుడిగా పదేళ్ల పని చేశారు. గతంలో అనంతపురం స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చారు. ఈయన వద్ద చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. రమేష్‌రెడ్డి మృతి చెందారనే విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.. గురువారం ఉదయం ఆస్పత్రికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, అధ్యాపకులు, జీసీటీఏ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్, ఇతర ప్రిన్సిపాళ్లు సంతాపం తెలిపారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహిద్దాం

- జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ

కళ్యాణదుర్గం: ఖరీఫ్‌లో రైతులు చిరుధాన్యాలు సాగు చేసేలా ప్రోత్సహిద్దామని జిల్లా వ్యవసాయ అధికారిణి (డీఏఓ) ఉమా మహేశ్వరమ్మ వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. స్థానిక కేవీకేలో ఏడీఏ యల్లప్ప అధ్యక్షతన గురువారం కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లోని ఆరు మండలాల ఆర్‌బీకే సిబ్బంది, వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు,



మాట్లాడుతున్న డీఏఓ ఉమా మహేశ్వరమ్మ

కొర్రలు వంటి వాటిలో ఏదో ఒక రకాన్ని రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఆర్బీకే పరిధిలోని సిబ్బంది ఆయా గ్రామాల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లో చాలా మంది రైతులు పీఎం కిసాన్ ఈ కేవైసీ చేయించుకోలేదన్నారు. పీఎం కిసాన్ డబ్బు రావాలంటే తప్పకుండా ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ (పంట సాగుదారు హక్కు పత్రాలు) సంబంధిత సచివాలయంలో వీఆర్వోలు అందజేయాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాల ద్వారా పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. సబ్సిడీ కింద పంపిణీ చేసే వేరుశనగను త్వరితగతిన రైతులకు అందించాలని, ఆర్‌బీకేలలో ఎరువులను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆయా ఆర్‌బీకేల ద్వారా మట్టి నమూనాలను సేకరించి అనంతపురం పంపాలని చెప్పారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- సచివాలయ వీఆర్‌ఓలకు డీఆర్‌ఓ గౌతమి సూచన

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని డీఆర్‌ఓ గాయత్రిదేవి సచివాలయ వీఆర్‌ఓలకు సూచించారు. బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వీఆర్‌ఓల్లో మూడు కేటగిరీల వారికి పోస్టింగ్ ఇచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్‌ఓ కౌన్సెలింగ్ నిర్వహించారు. 57 మంది దరఖాస్తు చేసుకోగా.. మెడికల్ కేటగిరీలో నలుగురు, మ్యూచువల్ కేటగిరీ కింద ఆరుగురు, స్పౌజ్ కింద ఏడుగురు మొత్తం 17 మందికి బదిలీకి అవకాశం కల్పించారు. ముందుగా కలెక్టరేట్ పరిపాలనాధికారి ఆధ్వర్యంలో సిబ్బంది లీలాకాంత్, భరత్, తదితరులు దరఖాస్తుదారుల సర్టిఫి



వీఆర్‌ఓల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఏఓ శ్రీధర్

కెట్లను పరిశీలించారు. అనంతరం ఖాళీల జాబితాను ఉద్యోగులకు అందజేసి ఆప్షన్‌కు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఆప్షన్ ప్రకారం స్థానాలు కేటాయించామన్నారు. జనరల్ కేటగిరీ కింద మిగిలిన 40 మందికి ప్రభుత్వం నిర్ణయించిన తేదీన బదిలీ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు.



శస్త్రచికిత్స చేయించుకున్న వెన్నెలకు మందులిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ జయ

వెన్నెల 'గ్రహణ'ం వీడింది!

- గ్రహణ మొర్రితో చిన్నారి వెన్నెల అవస్థ
- రూపాయి ఖర్చు లేకుండా శస్త్రచికిత్స చేయించిన రాష్ట్ర ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

కూడేరు: గ్రహణ మొర్రితో జన్మించిన ఓ చిన్నారికి శస్త్రచికిత్స చేయించి ఆ ఇంట కొత్త కాంతులు నింపింది రాష్ట్ర ప్రభుత్వం. రూ. లక్ష వ్యయమయ్యే ఆపరేషన్ ఉచితంగా పూర్తి కావడంతో చిన్నారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రామీణులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కొన్నిరోజుల క్రితం ఎంఎల్‌హెచ్‌పీల ఆధ్వర్యంలో ఇంటింటా సర్వేకు శ్రీకారం చుట్టారు. కొన్ని రోజుల క్రితం కూడేరు మండలం కమ్మూరులో సర్వే నిర్వహించిన ఎంఎల్‌హెచ్‌పీ జయ.. గ్రామానికి చెందిన వీరనారయణ కుమార్తె వెన్నెల గ్రహణ మొర్రి సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించి వివరాలను యాప్‌లో పొందుపరిచారు. ఆ వివరాల ఆధారంగా జిల్లా వైద్య శాఖ అధికారులు చిన్నారిని ఆపరేషన్ కోసం చెన్నైలోని సవితా ఆస్పత్రికి రెఫర్ చేశారు. వైద్యులు మే 27న ఉచితంగా శస్త్రచికిత్స చేసి గ్రహణమొర్రి లోపాన్ని దూరం చేశారు. ఈ విషయంపై చిన్నారి తండ్రి వీరనారాయణ మాట్లాడుతూ.. దాదాపు రూ.లక్షపైగానే ఖర్చయ్యే శస్త్రచికిత్సను తమ కుమార్తెకు ఉచితంగా చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

అక్రిడిటేషన్ కార్డుల మంజూరు

అనంతపురం అర్బన్: జిల్లాలో తొలి విడతలో అర్హత పొందిన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను గురువారం కలెక్టర్ గౌతమి ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఐదుగురు పాత్రికేయులకు కార్డులను అందజేసి లాంఛనంగా ఈ ప్రక్రియను మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలో పనిచేస్తూ సంక్షేమ పథకాలను అర్హుల దరి చేర్చడంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. కాగా, జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 230 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరయ్యాయని, వీటిని సంబంధిత ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించిన బ్యూరో ప్రతినిధులు, వెటరన్ జర్నలిస్టులు నేరుగా డీపీఆర్‌ఓ కార్యాలయంలో అందుకోవాలని సమాచార శాఖ డీఐ గురుస్వామిశెట్టి కోరారు. కార్యాలయ పనివేళల్లో సహాయ సమాచార ఇంజనీర్ రామాంజినేయులు ద్వారా కార్డులు తీసుకోవాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

లేపాక్షి: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం పులమతి ఎస్సీ కాలనీకి చెందిన నరసింహప్ప, ఆదెమ్మ దంపతుల కుమారుడు రామాంజినప్ప (35)కు భార్య కల్పన, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించేవాడు. ఇటీవల మద్యానికి బానిసై అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక గతంలో మూడు పర్యాయాలు చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. సకాలంలో స్థానికులు గుర్తించి వెలికి తీసి కాపాడడంతో ప్రాణాలు దక్కాయి. కొన్ని రోజుల క్రితం కాన్పు కోసం భార్య పుట్టింటికి వెళ్లింది. బుధవారం రాత్రి పొద్దు పోయాక తన తల్లిదండ్రులు ఉంటున్న ఇంటి పక్కనే ఉన్న పాతింట్లో నిద్రించేందుకు వెళ్లిన రామాంజినప్ప మంచం తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం తల్లి ఆదెమ్మ వెళ్లి కుమారుడిని నిద్రలేపేందుకు వెళ్లినప్పుడు ఈ ఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

చెరువుకు గండి

బత్తలపల్లి: మండలంలోని కట్టకిందపల్లి చెరువు కట్ట మధ్యలో రంధ్రం పడడంతో నీరు వృథాగా పోతోంది. విషయాన్ని గమనించిన దంపెట్ల సర్పంచ్ చల్లా కరుణాకరనాయుడు సమాచారం అందించడంతో గురువారం ఉదయం నీటి పారుదల శాఖ డీఈ మహేశ్వరరెడ్డి చెరువు కట్టను పరిశీలించారు.


కాసులు కురిపిస్తున్న రెడ్ లేడీ

- కొత్త రకం బొప్పాయి సాగుకు రైతుల ఆసక్తి
- ఉమ్మడి జిల్లాలో 4,646 హెక్టార్లలో పంట సాగు
- అత్యధికంగా కళ్యాణదుర్గం డివిజన్‌లో 2,517 హెక్టార్లలో పంట

కళ్యాణదుర్గం: ఉద్యాన పంటల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఈ నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో బోరుబావుల్లో నీరు సమృద్ధిగా లభ్యమవుతుండడంతో ఎటూ చూసినా బిందు, తుంపర సేద్యాలతో భూములు పచ్చని తోటలతో కళకళలాడుతున్నాయి. ఒకప్పుడు వేరుశనగ, టమాట పంటలకు మాత్రమే అలవాటు పడిన రైతన్నలు ప్రస్తుతం ఉద్యాన పంటలు సాగుతో ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి మహా నగరాలకు పంట ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారు.

ఫలించిన ఉపాధ్యాయుడి ప్రయోగం..

కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్ పరిధిలోని చాపిరి గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు పాతిరెడ్డి తన పూర్వీకుల ద్వారా సంక్రమించిన వ్యవసాయాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో తరచూ వివిధ రకాల పంటల సాగుతో ప్రయోగాలు చేయడం ఆయనకు అలవాటుగా మారింది. ఇటీవల తనకున్న ఏడు ఎకరాల పొలంలో 'రెడ్ లేడీ 786' తైవాన్ రకం బొప్పాయి సాగు చేపట్టారు. మొత్తం 5,500 మొక్కలు నాటారు.


విరగ్గాసిన బొప్పాయి పంట


గ్రేడింగ్ చేసిన కాయలను లోడుకు తీసుకెళ్తున్న కూలీ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బొప్పాయి సాగు ఇలా..	
బొప్పాయి సాగు విస్తీర్ణం	4,646 హెక్టార్లు
మొత్తం దిగుబడి	4,41,370 మెట్రిక్ టన్నులు
కళ్యాణదుర్గం డివిజన్ సాగు విస్తీర్ణం	2,517 హెక్టార్లు
కళ్యాణదుర్గం డివిజన్‌లో పంట దిగుబడి	2,39,129 మెట్రిక్ టన్నులు
ప్రస్తుతం టన్ను ధర	రూ.18 వేలు

మొక్క కొనుగోలు మొదలు.. ఇప్పటి వరకూ రూ.6లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. తొలి విడత పంట కోతలో 40 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.18 వేలు చొప్పున మార్కెట్‌కు తరలించడంతో రూ.7.20 లక్షలు చేతికి అందాయి. దీంతో పెట్టుబడి పోను రూ.1.20 ఆదాయం దక్కింది. తోటలో ఇంకా 150 టన్నుల పంట ఉంది. వీటి ద్వారా ఎంత లేదన్నా రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లా రైతుల ఆసక్తి..

సంప్రదాయ పంటలతో నష్టాలను చవి చూసిన రైతులు ఈ సారి వినూత్న పంటల సాగు వైపు దృష్టి సారించారు. ఈ క్రమంలో పండ్ల తోటల సాగు విస్తీర్ణం క్రమేపి పెరుగుతూ వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,646 హెక్టార్లలో బొప్పాయి సాగు లోకి వచ్చినట్లు కళ్యాణదుర్గంలోని కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు తెలిపారు. మొత్తంగా ఈ పంట ద్వారా ఇప్పటి వరకూ 4,41,370 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించగా... ఇందులో అత్యధికంగా కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్ పరిధిలో 2,517 హెక్టార్ల ద్వారా 2,39,129 టన్నులు ఉన్నట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.18 వేలుతో పంట అమ్ముడుబోతుండగా... జూలై నాటికి రూ.25 వేలకు చేరుకునే అవకాశమున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

మంచి ఆదాయం ఉంది



నేను ఏడు ఎకరాల్లో బొప్పాయి పంట సాగుకు రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టాను. ఇప్పటికే నా చేతికి పెట్టుబడి వచ్చేసింది. ఇంకా తోటలో 150 టన్నుల పంట దిగుబడి ఉంది. జూలై నాటికి మామిడి పంట కాలం అయిపోతుంది. అప్పుడు బొప్పాయి ధరలు మరింతగా పెరుగుతాయని నమ్మకం ఉంది. మనసు పెట్టి చేస్తే వ్యవసాయానికి మించిన మంచి ఆదాయం మరేదానిలోనూ లేదు.

– పాతిరెడ్డి, రైతు, చాపిరి

'అనంత'లో సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

- జూలై 12 నుంచి మూడురోజుల పాటు నిర్వహణ


రాష్ట్ర కమిటీ సమావేశాల కరపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సభ్యులు

అనంతపురం అర్బన్: సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు అనంతపురం కేంద్రంగా జూలై 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్నాయి. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సమావేశాల కరపత్రాలను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశాల్లో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, కేరళ మాజీ ఎంపీ ఎం.ఎ.బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, మాజీ ఎంపీ పి.మధుతో పాటు అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు సమీక్షించుకుని అనుసరించాల్సిన రాజకీయ వైఖరి గురించి సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లప్ప, ఆర్‌వీనాయుడు, బాలరంగయ్య, రామిరెడ్డి పాల్గొన్నారు.

అనంత వేదికగా ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్

- 'సంధ్యారవళి' పేరుతో 12 గంటల పాటు నిర్విరామ నృత్య ప్రదర్శనలు

అనంతపురం కల్చరల్: ఈ నెల 22న అనంతపురంలోని టీటీడీ కల్యాణ మంటపం వేదికగా ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురంలోని శ్రీనృత్య కళానిలయం వ్యవస్థాపకురాలు సంధ్యామూర్తి తెలిపారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సంధ్యారవళి పేరిట జరిగే 'ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్'లో కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిశా రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన నృత్యకళాకారులతో కలసి తమ శిష్యబృందాలు నాట్య ప్రదర్శన ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 12 గంటల పాటు నిరిరామంగా సాగే శాస్త్రీయ నృత్య ప్రదర్శనను అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. నృత్య ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ కళాకారులు శ్రీనిధి రఘు, నాగమ్మ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న నాట్యాచార్యులు సంధ్యామూర్తి

శతాధిక వృద్ధుడి మృతి

గుత్తి: స్థానిక కర్నూలు రోడ్డులో నివాసముంటున్న జీకె వెంకటస్వామి (101) గురువారం తెల్లవారు జామున కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండే వారు. మృతునికి ముగ్గురు కొడుకులు, ఆరుగురు కుమార్తెలు, పదుల సంఖ్యలో మనవళ్లు, మనువరాళ్లు, ముని మనవళ్లు, ముని మనవరాళ్లు ఉన్నారు. వెంకటస్వామి మృతిపై బలిజ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారాకుల రమణ, శ్రీకరం గోవిందరాజులు, కోశాధికారి మంజు, మోహన్, కార్యదర్శులు శ్రీకరం వెంకటేష్, శ్రీకరం హరి, శ్రీకరం నరేష్, రాము, నాని, రఘు, అరుణ్ సంతాపం ప్రకటించారు.


జీకె వెంకటస్వామి (ఫైల్)

సజావుగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు

- వార్డు సచివాలయాల పరిధిలో ఆరు కేటగిరిల్లో 95 మందికి కౌన్సెలింగ్
- పీఆర్ పరిధిలో 53 మందికిగాను 43 మందికి బదిలీ

అనంతపురం క్రైం/సిటీ: ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గురువారం సజావుగా సాగింది. నగరపాలక సంస్థ, వివిధ మునిసిపాలిటీలు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్, శానిటేషన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, అమినిటీస్, ప్లానింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల కేటగిరిలో ఉద్యోగుల బదిలీకి కౌన్సెలింగ్ చేపట్టారు. అడ్మినిస్ట్రేటివ్, శానిటేషన్‌కు నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి, ఎడ్యుకేషన్, వెల్ఫేర్‌కు కదిరి మునిసిపల్ కమిషనర్ హరిబాబు, అమినిటీస్‌కు ధర్మవరం కమిషనర్ శేషన్న, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ సతీష్‌చంద్ర, ప్లానింగ్‌కు గుంతకల్లు మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీ రాజ్ శాఖలో ఆ శాఖ అనంతపురం జిల్లా ఎస్‌ఈ భాగ్యరాజ్, శ్రీసత్యసాయి జిల్లా ఈఈ మురళీ కౌన్సెలింగ్ అధికారులుగా వ్యవహరించారు. దివ్యాంగులైన ఉద్యోగుల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. వార్డు సచివాలయాల పరిధిలో మొత్తం 107 మంది దరఖాస్తు చేసుకోగా 106 మంది హాజరయ్యారు, అందులో 95 మందికి బదిలీ ఉత్తర్వులిచ్చారు. మరో 11 మంది దరఖాస్తులను తిరస్కరించారు. ఇంజినీరింగ్ విభాగంలో 53 మంది దరఖాస్తు చేసుకోగా, 43 మందికి బదిలీలు చేశారు. కోరుకున్న ప్రాంతాల్లో ఖాళీలు లేకపోవడంతో ముగ్గురు పాత స్థానాల్లోనే ఉంటామంటూ తెలిపారు. మరో ఐదుగురు సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించక పోవడంతో వారి దరఖాస్తులను తిరస్కరించారు. బదిలీ అయిన వారికి సాయంత్రం ఉత్తర్వులు అందజేశారు. పీఆర్ కార్యాలయంలో నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్ ప్రకియను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, రసూల్ పర్యవేక్షించారు.


బదిలీల కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి

ఉద్యోగులకు మంచి అవకాశం

నగర పాలక సంస్థలో చేపట్టిన బదిలీల కౌన్సెలింగ్‌ను మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఎంతో విలువనిచ్చి బదిలీలకు మంచి అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రెట్టింపు ఉత్సాహంతో పేదలకు మెరుగైన సేవలందించాలన్నారు.

రైతు దారుణహత్య

- గొర్రెల మంద వద్ద నిద్రిస్తుండగా గొంతు కోసిన దుండగులు
- అనుమానితులను విచారిస్తున్న పోలీసులు



హతుడు కురబ గోవిందప్ప, రోదిస్తున్న హతుడి భార్య పోలక్క, బంధువులు

కళ్యాణదుర్గం: మండలంలోని కదరంపల్లిలో రైతు కురుబ గోవిందప్ప (43) దారుణ హత్యకు గురయ్యాడు. గొర్రెల మంద వద్ద కాపలాకు వెళ్లిన ఆయనను దుండగులు గొంతుకోసి హతమార్చారు. పోలీసులు తెలిపిన మేరకు....

కుటుంబానికి పెద్ద దిక్కుగా..

కదరంపల్లికి చెందిన గోవిందప్పకు భార్య పోలక్క, ఇద్దరు కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. తనకున్న పది ఎకరాల్లో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుమార్తెకు వివాహం చేసి అత్తారింటికి పంపారు. గోవిందప్ప సోదరుడు, మండల ప్రాదేశిక మాజీ సభ్యుడు వెంకటేశులు మూడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి తన సోదరుడికి చెందిన పది ఎకరాల పొలంలోనూ సేద్యం చేస్తూ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచాడు. అన్ని విషయాలు తానే చూసుకుంటూ రెండు కుటుంబాల అవసరాలను తీరుస్తూ వస్తున్నాడు.

గొర్రెల మందకు కాపలాకు వెళ్లి..

కదరంపల్లికి చెందిన గోవిందప్ప బామ్మర్ది వెంకటేశులు కుమారుడు మహేష్.. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులోని గురుకుల పాఠశాలలో చదువుకుంటున్నాడు. వేసవి సెలవులు ముగియడంతో బుధవారం కుమారుడిని పాఠశాలలో వదిలి వచ్చేందుకు వెంకటేశులు వెళ్లాడు. వెనుతిరిగి వచ్చే లోపు ఆలస్యమవుతుందని, రాత్రికి గొర్రెల మంద వద్ద కాపలాగా ఉండాలని కోరడంతో గోవిందప్ప అంగీకరించాడు. దీంతో గొర్రెలను గోవిందప్ప పొలం వద్ద విడిచి వెంకటేశులు కుమారుడిని పిలుచుకుని జమ్మలమడుగుకు వెళ్లాడు. బుధవారం రాత్రి భోజనం ముగించుకుని గొర్రెల మందకు కాపలాకు వెళ్లిన గోవిందరాజులు.. రాత్రి అక్కడే నిద్రించాడు.

అర్ధరాత్రి దాటిన తర్వాత

అర్ధరాత్రి గోవిందప్ప గాఢ నిద్రలోకి చేరుకున్న విషయాన్ని గుర్తించిన దుండగులు.. బలమైన ఆయుధంతో గొంతకోశారు. అధిక రక్త స్రావంతో కొట్టుమిట్టాడుతూ ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం గొర్రెల మంద వద్దకు వెంకటేశులు చేరుకున్నప్పుడు ఈ ఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న హతుడి భార్య పోలక్క, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. సమీపంలోని కొండాపురం, తిమ్మసముద్రం, బాలవెంకటాపురం, నుసికొట్టాల తదితర గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు సంఘటనా స్థలానికి తరలి వచ్చి, హతుడిని పరిశీలించి, బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు.

రంగంలో క్లూస్ టీం


గోవిందప్ప హత్య ఘటనను తెలుసుకున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ తేజమూర్తి ఎస్‌ఐలు సుధాకర్, నాగమధు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. రంగంలో స్నిఫ్ఫర్ డాగ్, క్లూస్ టీంను దింపారు. హత్య జరిగిన ప్రదేశం మొదుల సమీపంలోని పొలాల్లో దుండగుల ఆనవాళ్ల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానితులను వివిధ కోణాల్లో విచారణ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

కోలుకుంటున్న కొంగలు


వీరాపురం వీధుల్లో సంచరిస్తున్న సైబీరియన్ కొంగ

చిలమత్తూరు: మండలంలోని వీరాపురంలో వలస పక్షులైన సైబీరియన్ కొంగలు, వాటి పిల్లలు కోలుకుంటున్నాయి. గత నెల 29న గాలీవాన బీభత్సానికి పదుల సంఖ్యలో కొంగలు మృత్యువాత పడిన విషయం తెలిసింది. ఆ సమయంలో గాయపడిన కొంగలు, వాటి పిల్లలను స్థానికులు సంరక్షిస్తూ వచ్చారు. ఈ క్రమంలో క్రమంగా అవి కోలుకుంటుండడంతో గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

టీడీపీ నాయకుల దౌర్జన్యం


నాగన్న ఇంటి ఎదుట దారికి అడ్డంగా వేసిన రాళ్లు

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లిలో టీడీపీ నాయకులు దౌర్జన్యానికి తెగబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... చిన్నంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగన్న, సరోజమ్మ దంపతులు తన సొంత స్థలంలో గృహ నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో గురువారం పునాది వేసేందుకు భూమి పూజ చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు బడీరప్ప, హనుమంతరాయుడు, శివన్న, మూర్తి తదితరులు అక్కడకు చేరుకుని భూమి పూజను అడ్డుకున్నారు. ఆ స్థలంలో గృహ నిర్మాణం చేపట్టరాదంటూ గొడవకు దిగి, రాళ్లను అడ్డుగా వేశారు. తన సొంత స్థలంలో ఇల్లు కట్టుకుంటే మీకెందుకు అభ్యంతరమంటూ నాగన్న నిలదీయడంతో భౌతిక దాడికి పాల్పడ్డారు. ఘటనలో నాగన్న, సరోజమ్మ, విశాలాక్షి గాయపడి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ యువరాజ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి

ధర్మవరం అర్బన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...ధర్మవరం మున్సిపల్ పరిధిలోని చిన్నూరుకు చెందిన గంటా మల్లికార్జున (34)కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. బుధవారం ధర్మవరంలో పనులు ముగించుకుని ఇంటికి వెళుతూ శివాలయం వద్ద ఉన్న చెరువులో శరీరాన్ని శుభ్రం చేసుకుంటుండగా అదుపు తప్పి నీటిలో పడ్డాడు. లోతు ఎక్కువగా ఉండడంతో పాటు ఈత రాని కారణంగా నీట మునిగి ఊపిరాడక మృతి చెందాడు. గురువారం ఉదయం చెరువులో మృతదేహం తేలింది. గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో భార్య రామలక్ష్మి అక్కడకు చేరుకుని మృతుడిని మల్లికార్జునగా ధ్రువీకరిస్తూ బోరున విలపించింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.


మల్లికార్జున (ఫైల్)

94 బస్తాల విత్తన వేరుశనగ స్వాధీనం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని చెర్లోపల్లికి చెందిన టీడీపీ నేత నందబోయిన భాస్కర్ తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 94 బస్తాల విత్తన వేరుశనగ కాయలను రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ నవీన్‌కుమార్, ఏఓ వెంకటబ్రహ్మం తెలిపారు. గురువారం సాయంత్రం అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా 94 బస్తాల విత్తన కాయలు నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. వీటిని నల్లమాడ మండలం వేళ్లమద్దికి చెందిన రైతు గోవిందరెడ్డి నుంచి కొనుగోలు చేసినట్లు భాస్కర్ తెలిపాడు. స్వాధీనం చేసుకున్న విత్తన కాయలను స్థానిక సచివాలయంలో భద్రపరిచారు.


సచివాలయంలో భద్ర పరిచిన విత్తన వేరుశనగ బస్తాలు

చేనేతలకు సబ్సిడీతో పరికరాలు


మాట్లాడుతున్న జిల్లా చేనేత ఏడీ అప్పాజీ

యాడికి: చేనేత కార్మికులకు 90 శాతం సబ్సిడీతో కేంద్ర ప్రభుత్వం మగ్గం పరికరాలను అందజేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళిశాఖ ఏడీ అప్పాజీ పిలుపునిచ్చారు. గురువారం అనంతపురం జిల్లా యాడికిలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో మండలంలోని చేనేత కార్మికులతో ఆయన సమావేశమై మాట్లాడారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ పరిధి వెలుపల ఉన్న చేనేత కార్మికులకు మగ్గం ఉన్నతీకరణ, నాణ్యత, ఉత్పాదకతను పెంచేందుకు మగ్గం పరికరాల కొనుగోలుకు కేంద్రం ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. సొంత ఇంటి స్థలం ఉన్న ఎస్సీ, ఎస్టీ, ట్రాన్స్‌జెండర్ వర్గాలకు చెందిన చేనేత కార్మికులు వ్యక్తిగత వర్క్ షెడ్‌ల నిర్మాణానికి 100 శాతం రాయితీతో రూ1.20 లక్షలు, మిగిలిన వారికి 75 శాతం రాయితీతో షెడ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాముకాటుతో వివాహిత మృతి

గుడిబండ: మండలంలోని మోరుబాగల్‌కు చెందిన బసవరాజు భార్య మమత (35) పాము కాటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... గురువారం ఉదయం ఇంటి ఆవరణలో నీటి గేట్ వాల్ తిప్పుతుండగా వెళ్లిన మమతను నాగుపాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే కర్ణాటకలోని శిరాలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తుమకూరుకు తరలించారు. చికిత్సకు స్పందించక ఆమె మృతిచెందింది.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరి ఫోన్‌లో 'దిశ' యాప్ ఉండాలి

ఆత్మకూరు: ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో దిశ యాప్ తప్పని సరిగా ఉండాలని ఎస్ఐ జనార్దన్ తెలిపారు. గురువారం మండలంలోని వై.కొత్తపల్లి వద్ద వాహనదారులను ఆపి ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ఇన్‌స్టాల్ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఎక్కువగా మహిళలకు అపరిచితుల నుంచి అపాయం ఉన్నప్పుడు ఈ యాప్‌లో ఉన్న పోలీస్ స్టేషన్లకు ఫోన్ చేస్తే దగ్గరలో ఉన్న పోలీసులు వచ్చి రక్షించే అవకాశం ఉందన్నారు.

జెడ్పీచైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ



జిల్లా పరిషత్‌లోని పీఎఫ్ సెక్షన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలోని పలు సెక్షన్లను చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది పని తీరుపై ఆయా సెక్షన్ల పరిపాలనాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని సూచించారు. పనులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. ఐరిష్ హాజరు తప్పనిసరిగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.

భక్తి శ్రద్ధలతో గంగ పూజ



పూజలందుకున్న సర్వేశ్వరుడు

అనంతపురం కల్చరల్: శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక అరవిందనగర్‌లోని సర్వేశ్వరాలయంలో ప్రధాన అర్చకుడు గురుమూర్తి ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా తెల్లవారు జామున మహాశివుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, గంగపూజలు చేశారు. శుక్రవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఉరవకొండ గవిమఠం పీఠాధిపతి డాక్టర్ కరిబసవరాజేంద్ర మహాస్వామి ఆధ్వర్యంలో జరగనుంది.

రెండో విడతలో వేరుశనగ పంపిణీ



సనప ఆర్‌బీకే వద్ద సబ్సిడీ వేరుశనగను పరిశీలిస్తున్న రైతులు

ఆత్మకూరు: మండలంలోని రైతులకు కొద్ది రోజుల క్రితం మొదటి విడతలో భాగంగా సబ్సిడీ వేరుశనగను అందించారు. వారం రోజులుగా మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వేరుశనగ బస్తాలు స్టాక్ లేకుండా పోయాయి. రెండో విడుతలో భాగంగా గురువారం వేరుశనగ కాయల లోడ్లు వచ్చాయి.

ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా రమేష్‌బాబు



డీటీసీని కలిసిన రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా పి.రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప జిల్లా ఈడీ కార్యాలయం నుంచి బదిలీపై జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా నియమితులయ్యారు. ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రవాణాశాఖ డీటీసీ వీర్రాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నాగభూపాల్, బస్ స్టేషన్ మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



హర్షవర్ధన్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని న్యామద్దలకు చెందిన హర్షవర్ధన్ రెడ్డి (17) కనిపించలేదని తండ్రి మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. బాలుడు కొద్ది రోజులుగా పబ్జీగేమ్‌కు బానిసై మతిస్థిమితం కోల్పోయాడని, ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు సెల్: 9440796835లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

● రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విద్యార్థులకు జగనన్న కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి మరువరానిదని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు నియోజకవర్గ స్థాయి ప్రతిభా పురస్కార ప్రధానోత్సవ వేడుకలు, జగనన్న కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్ చదివి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు పురస్కారాలు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సాహించేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థీ బాగా చదువుకొని సమాజంలో గర్వించేస్థాయికి ఎదగాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే జగనన్న లక్ష్యమన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాకముందు ప్రభుత్వ పాఠశాలలు, వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలు ఎంత అభివృద్ధి చెందాయో పాఠశాలకు వెళ్లి చూస్తే తెలుస్తుందన్నారు. జ్ఞానం పెంచుకోవాలనే తపన విద్యార్థుల్లో పెరగాలన్నారు. నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులకు కిట్లను అందజేయడం ఒక చరిత్ర అన్నారు. గతంలో జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయితే అక్టోబర్, నవంబర్ నెలలో కూడా విద్యార్థులకు విద్యా సామగ్రి అందేది కాదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో బ్యాగ్, షూస్, యూనిఫాం, డిక్షనరీ, పాఠ్య పుస్తకాలతో కూడిన కిట్లను పాఠశాల ప్రారంభమైన రోజే విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ..

విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు మెడల్, తల్లిదండ్రులతో పాటు విద్యార్థులను దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు, ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున, మేకల, గొర్రెల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహ గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, అనంతపురం రూరల్ ఎంపీపీ వరలక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిట్రా వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు



విద్యార్థికి నగదు, మెడల్ అందిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం, జిల్లా విద్యాధికారి సాయిరాం

● జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం క్రైం: విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సంస్కరణకు తీసుకొచ్చారని జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. విద్యాకానుకలతోపాటు అమ్మ ఒడిలాంటి పథకాల ద్వారా విద్యార్థుల భవితకు బాట వేశారన్నారు. గురువారం ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నగరంలోని రాజేంద్రనగరపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి నగదు, మెడల్, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం పాల్గొని విద్యార్థులను సన్మానించారు. జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ పిల్లలను స్కూల్‌కు క్రమం తప్పకుండా పంపాలన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యారంగంలో వివిధ పథకాలను ప్రవేశపెట్టి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య మాట్లాడుతూ నాడు–నేడు పనులతో కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు. డీఈఓ సాయిరాం మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులను సత్కరించడం ద్వారా మిగితా విద్యార్థులకు స్ఫూర్తి కలిగి భవిష్యత్‌లో వారు ప్రగతి సాధిస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంఈఓ వెంకటస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రమణ్యం

రాప్తాడు: ప్రస్తుతం వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రమణ్యం అన్నారు. గురువారం మండలంలోని ఎం.చెర్లోపల్లిలో నట్టల నివారణ వ్యాధి, నీలి నాలుక వ్యాధి, చిటుక వ్యాధి నివారణకు టీకా వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రమణ్యం మాట్లాడుతూ గొర్రెల కాపరులు తమ గొర్రెలకు ఇన్సూరెన్స్ చేపించుకోవాలన్నారు. ఒక్కో గొర్రెకు మూడేళ్ల కాలపరిమితికి రూ.36 కట్టి ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. గొర్రెకి ఏదైనా ప్రమాదం జరిగితే జీవానికి రూ.8 వేలు ఇన్సూరెన్స్ నిధులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక డీడీ రమేష్ రెడ్డి, గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, పశువైద్యాధికారులు సోమేశ్వరి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో కొంత కాలంగా చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న అనుమానితుడిని అనంతపురం త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. గురువారం మధ్యాహ్నం స్థానిక శ్రీనివాసనగరులోని బాలాజీ కళ్యాణ మంటపం వద్ద ఓ మహిళ మెడలోని బంగారు పుస్తెల గొలుసును అపహరించే ప్రయత్నం చేసిన యువకుడిని స్థానికులు త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. కాగా తులం బంగారు గొలుసును లాక్కొని ఉడాయించేందుకు యత్నించిన యువకుడిని స్థానికుల సహకారంతో త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు పట్టుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక భద్రత



ముస్లిం మైనార్టీలకు కరపత్రాలు పంచుతున్న మేయర్ మహమ్మద్ వసీం సలీం తదితరులు

అనంతపురం సిటీ: వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీలకు సామాజిక భద్రత సాధ్యమైందని నగర మేయర్ వసీం అన్నారు. గురువారం నగరంలోని మహమ్మద్ తారా మస్జీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మేయర్ వసీం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, ఆర్థిక లబ్ధిపై వివరించారు. వైఎస్సార్ హయాంలో చేసిన మేలు, ఇప్పుడు జగన్ చేస్తున్న మంచిని ఒక్కొక్కటిగా వివరించారు. ముస్లిం మైనార్టీలకు సామాజిక భద్రత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే సాధ్యమైందన్నారు. రాజకీయంగా ముస్లింలకు ప్రాధాన్యం ఇచ్చి, కార్పొరేటర్ నుంచి డిప్యూటీ సీఎం వరకు అనేక పదవులు కట్టబెట్టారని కొనియాడారు. ముస్లింలందరూ వైఎస్ జగన్ వెంటే ఉందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ముతవల్లి రషీద్, ఇమాం, అన్వర్, కమిటీ సభ్యులు బాషా, ఖాదర్, మెహరాజ్, సయ్యద్, ఇమాం, ముస్తఫా ఖాదిర్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించాలి



రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లిలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగరత్న

రాప్తాడు: పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న అన్నారు. గురువారం ఎం.బండమీదపల్లి, గంగలకుంట, రాప్తాడు, రామినేపల్లి, యర్రగుంట, ప్రసన్నాయపల్లి, చిన్మయనగర్, మరూరు, గొల్లపల్లి, గాండ్లపర్తి, బుక్కచెర్ల తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ చిన్నారుల తల్లులకు జన భగీదారీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆరేళ్లలోపు ఉండే బాల్యదశ చాలా ముఖ్యమైందన్నారు. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు సమాజంలో ఉన్న వారికి పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల అవశ్యకతపై అవగాహన కల్పించడానికి జగభాగీదారీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. మరమ్మతు చేయించారు!





నగరంలోని టీటీడీ కల్యాణ మంటపం సమీపంలో భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటు చేసిన ఇనుప ద్వారం సమస్య పరిష్కారమైంది. ఈనెల 13న 'సాక్షి'లో ప్రమాదకరంగా ఇనుప ద్వారం శీర్షికన ఫొటో కథనం ప్రచురితమైంది. రైల్వే అధికారులు స్పందించి, మరమ్మతులు చేయించారు. పెద్ద ఇనుప స్తంభాలతో ఏర్పాటు చేసిన ప్రమాదకరంగా ద్వారం కూలడానికి సిద్ధంగా ఉండేది. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు, పాదచారులు, వాహనదారులు భయాందోళన చెందేవారు. సమస్యల పరిష్కారం కావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

ఎస్ఎన్‌సీయూలో అదనపు పడకలు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డు, నవజాత శిశు కేంద్రం (ఎస్ఎన్‌సీయూ)లో అదనపు పడకలను ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ సంబంధిత వైద్యులను ఆదేశించారు. గురువారం సూపరింటెండెంట్ చిన్నపిల్లల వార్డు, రేడియాలజీ విభాగాలను పరిశీలించారు. ఎస్ఎన్‌సీయూలో పసికందుల కోసం మూడు వార్మర్లను అందుబాటులో ఉంచాలన్నారు. రేడియాలజీ విభాగంలో పని చేయని ఎక్స్‌రే మిషన్లను ఆయన పరిశీలించారు. ఫైరిక్స్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి తక్షణం వాటిని మరమ్మతు చేయించాలన్నారు. సూపరింటెండెంట్ వెంట రేడియాలజీ హెచ్ఓడీ డాక్టర్ సురేష్ తదితరులు ఉన్నారు.

శ్రీశ్రీ జీవితం అందరికీ ఆదర్శం



నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

అనంతపురం కల్చరల్: తెలుగు సాహిత్యాన్ని అభ్యుదయ భావజాలంతో ఉర్రూతలూగించిన మహాకవి జీవితం అందరికీ ఆదర్శమని వక్తలు అన్నారు. గురువారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నగరంలోని శ్రీశ్రీ కళావేదిక కార్యాలయంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతిని అనంత రచయితలు, కవులు నిర్వహించారు. కార్యక్రమంలో కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీరెడ్డి, ఉపాధ్యక్షుడు అల్తాఫ్, యువజన సంఘం రాష్ట్ర నాయకులు అశోక్‌కుమార్, లక్ష్మీదేవి శ్రీశ్రీ జీవిత విశేషాలను, రచనలపై ప్రసంగించారు. నిస్తేజంగా ఉన్న సాహిత్యాన్ని మహాప్రస్థానం కవితా ఖండిక ఎంతోమందికి స్ఫూర్తినందించి సరికొత్త కవిత్వానికి బాటలు వేశాయన్నారు. అంతకుముందు శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

అడ్డగోలు ఫీజులకు అడ్డుకట్ట వేయాలి



డీఈఓ సాయిరామ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీఎస్ఎఫ్ నాయకులు

రాప్తాడురూరల్: అడ్డగోలు ఫీజుల వసూలుకు అడ్డుకట్ట వేయాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏపీఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఈఓ సాయిరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర మాట్లాడుతూ వివిధ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు రూ.వేలు, రూ.లక్షలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్నారన్నారు. ఈ–టెక్నో, కాన్సెప్ట్, ఒలింపియాడ్, సి–బ్యాచ్, కోస్పార్క్, ఇంటిగ్రేటెడ్ బ్యాచ్, సైనిక్ తదితర అనుమతులు లేని కోర్సుల పేర్లతో విద్యా సంస్థలు నడుపుతున్నారన్నారు. ఇలాంటి స్కూళ్లకు గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీఎస్ఎఫ్ జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యం, నగర అధ్యక్షులు గురుసాయి శ్రీకాంత్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

డ్రిప్ ఫిట్టర్లకు శిక్షణ



డ్రిప్ ఫిట్టింగ్‌పై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్న పీడీ జి.ఫిరోజ్‌ఖాన్, టెక్నీషియన్లు

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్ యూనిట్లు, స్ప్రింక్లర్ల సెట్లు అమర్చుకోవడంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించడానికి స్వయం ఉపాధి నిమిత్తం నిరుద్యోగ యువతకు ఫిట్టింగ్‌పై ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ ప్రారంభించారు. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో ఆసక్తి ఉన్న ఫిట్లర్లకు ఏపీఎంఐపీ పీడీ జి.ఫిరోజ్‌ఖాన్, ఉద్యానశాఖ డీడీ బి.రఘునాథరెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఇంజనీరు శంకరరెడ్డి, టెక్నీషియన్లు దిలీప్, సతీష్ తదితరులు విషయ పరిజ్ఞానంతో పాటు ఫిట్టింగ్‌పై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో డ్రిప్, 55 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లు అందిస్తోందని పీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. గతేడాది 13,500 హెక్టార్లకు మంజూరు చేయగా, ఈ ఏడాది 12,500 హెక్టార్ల లక్ష్యంతో యూనిట్ల మంజూరు కార్యక్రమం ప్రారంభించారు. ఫిట్టర్ల కొరత ఉన్నందున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడం ద్వారా క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని ఏపీఎంఐపీ పీడీ తెలిపారు. శనివారం బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లిలో పంట పొలాల్లోనే అవగాహన కల్పిస్తామన్నారు.

పశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీడీ డాక్టర్ రమేష్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం పశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పశుబీమా చేయించుకున్న రైతులకు ప్రమాదవశాత్తు పశువు మృతి చెందితే వారంలోగా పరిహారం రైతు బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారన్నారు. ఏడీ డాక్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ 75 శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 30 వరకు మండల వ్యాప్తంగా గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణకు మందులు సరఫరా చేస్తున్నామన్నారు. 65 శాతం రాయితీతో పశువుల దాణా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కావాల్సిన రైతులు మండల కేంద్రంలోని వెటర్నీ కార్యాలయం లేదా 9440126869(డాక్టర్ రత్నకుమార్) నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

21న రైతు గర్జన సభ



మాట్లాడుతున్న మల్లికార్జున

రాప్తాడురూరల్: కలెక్టరేట్ వద్ద ఈనెల 21న నిర్వహించనున్న 'రైతు గర్జన'కు పెద్ద ఎత్తునతరలి రావాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున పిలుపునిచ్చారు. రాయలసీమ నీటి సాధన కోసం చేపట్టిన రైతు గర్జన ప్రచార జాతా ఆరోరోజు అనంతపురం రూరల్ మండలం కందుకూరు నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఐ అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లికార్జున మాట్లాడారు. తుంగభద్ర ఆధునికీకరణ చేయడానికి 5,500 క్యూసెక్కుల నుంచి 10 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచాలని డిమాండ్ చేశారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కందుకూరు, మన్నీల, కృష్ణంరెడ్డిపల్లి, పూలకుంట, అక్కంపల్లి, రాచానపల్లి, కొడిమి, నరసనాయనికుంట, తాటిచెర్ల, సోములదొడ్డి గ్రామాల్లో జాతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శులు నాగరాజు, శ్రీకాంత్, రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్, రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర, ధనంజయ ఏఐవైఎఫ్ నాయకులు రాము పాల్గొన్నారు.

పంట రుణాల పరిమితిని పెంచాలి

కనగానపల్లి: బ్యాంకుల ద్వారా రైతుల తీసుకునే ఖరీఫ్ పంట రుణాల పరిమితిని మరింత పెంచాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం కనగానపల్లిలో సమావేశమైన సీపీఐ నాయకులు మహదేవ, బాలరాజు, గోవిందు రైతు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ ద్వారా విడుదల చేస్తున్న 40 టీఎంసీల నీటిని 100 టీఎంసీలకు పెంచి సత్యసాయి జిల్లా అన్ని చెరువులకు నీరందించాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటలపై తీసుకుంటున్న పంట రుణాల పరిమితిని 50 శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: ఎంగిలిబండ క్రాస్ వద్ద 67వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తాడిపత్రికి చెందిన దూద్‌వలి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై గుంతకల్లుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి వెళ్తుండగా ఎంగిలిబండ బస్టాప్ వద్ద కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన దూద్‌వలిని అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుత్తి రూరల్: కరిడికొండలో గురువారం ప్రమాదవశాత్తు కర్రలు తలపై పడి బేల్దారికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనే బేల్దారి నూతన గృహంలో పనులు చేస్తుండగా పై నున్న సారవ కట్టెలు ఒక్కసారిగా అతడి మీద పడ్డాయి.

అంగన్‌వాడీల్లో ప్రీస్కూల్ తరగతులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులందరినీ అంగన్‌వాడీ స్కూళ్లలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ, వర్కర్ జయభారతి, కార్పొరేటర్ బాబా ఫకృద్దీన్ తదితరులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ తరగుతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరంలో 3వ సెక్టార్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలందరికీ ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయనున్నట్లు తెలిపారు.